నమస్తే తెలంగాణ

నిజామాబాద్

3 | నిజామాబాద్, సోమవారం 27 మే 2024 | NIZAMABAD




బోర్లంలో గాలికి ఎగిరిపోయిన హోటల్ పైకప్పు



అంబం రోడ్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన చెట్టు



బోర్లం గ్రామంలో వరుసగా నేలకూలిన విద్యుత్ స్తంభాలు



బాన్సువాడ మినీ ట్యాంక్ బండ్‌పై నేలవాలిన హైమాస్ట్‌లైట్





బోర్లంలో ఇంటి పైకప్పు ఎగిరిపోయి పూర్తిగా నేలమట్టమైన ఇల్లు

# ఉమ్మడి జిల్లాలో గాలి దుమారం



రుద్రూర్‌లో ఇంటిపై కూలిన వృక్షం

- విరిగిన విద్యుత్ స్తంభాలు.. నిలిచిన కరెంటు సరఫరా
- ఎగిరిపడిన ఇంటి పైకప్పులు
- నేలకొరిగిన భారీ చెట్లు
- పలుచోట్ల ఆస్తినష్టం

**ఉమ్మడి నిజామాబాద్** జిల్లాలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పలు ప్రాంతాల్లో గాలిదుమారం అతలాకుతలం చేసింది. బాన్సువాడ మండలం బోర్లం, బుడ్మి, తాడ్కోల్, కొత్తాబాది తదితర గ్రామాల్లో ఈదురుగాలులు భారీ నష్టాన్ని మిగిల్చాయి. ఒక్కసారిగా బలమైన గాలులు వీచడంతో బోర్లం గ్రామంలో 15 గృహ, 10 వ్యవసాయ విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. సుమారు 20ఇండ్ల వరకు ఇంటి పైకప్పులు గాలికి ఎగిరిపోయాయి. బాన్సువాడ- కామారెడ్డి ప్రధాన రహదారిపై కొయ్యగుట్ట వద్ద భారీ వృక్షం రోడ్డుపై పడింది. కోటగిరి మండల కేంద్రంలోని సర్కారు దవాఖాన సమీపంలో ఉన్న చెట్టు కొమ్మ పడడంతో చెట్టు కింద ఉన్న యువకుడు గమనించి పరుగులు తీశాడు. దీంతో ప్రాణాపాయం తప్పింది. రుద్రూర్ మండల కేంద్రంలో చెట్లు విరిగిపడి ఇండ్లు ధ్వంసమయ్యాయి. అక్బర్‌నగర్‌లో ప్రధాన రహదారిపై చెట్టు పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అంబంలో చెట్టు విరిగి ఇల్లు మీద పడింది. విద్యుత్ స్తంభాలు కూలి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అంబం శివారులో భారీ వృక్షం కూలి ఒక ఆటో, రెండు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి.

– బాన్సువాడ రూరల్/ కోటగిరి/ రుద్రూర్, మే 26



అంబంలో ఆటో, ద్విచక్రవాహనాలపై కూలిన భారీ వృక్షం




కోటగిరి మండలం రాంపూర్‌లో ఈదురుగాలులకు నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్

---

- అద్దాలమేడల్లో హాస్పిటల్స్


# కలర్.. కలెక్షన్ ఫుల్

- పేరుకే మల్టీ, సూపర్ స్పెషాలిటీ దవాఖానలు
- కానరాని పూర్తిస్థాయి వైద్యులు, వివిధ విభాగాలు
- రోగుల నుంచి రూ.లక్షల్లో దండుకుంటున్న యాజమాన్యాలు
- అత్యవసరమైతే రాజధానికి తీసుకెళ్లాలంటూ తప్పించుకోలు



**ఎటు చూసినా ఎత్తయిన భవనాలు..**అద్దాల మేడలు..భారీ హోర్డింగ్‌లు..కండ్లు మిరిమిట్లు గొలిపేలా రంగురంగుల బోర్డులు.. ఏ సందు చూసినా కిక్కిరిసిన జనం.. వాహనాన్ని పార్కింగ్ చేయడానికి దొరకని స్థలం.. నడవడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితి..ఇదంతా జిల్లా కేంద్రంలోని ఖలీల్‌వాడి ప్రాంతంలో కనిపిస్తుంది. ఇక్కడ రోజుకో కొత్త దవాఖాన లేదా ల్యాబ్‌లు వెలుస్తున్నాయి. మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ దవాఖానలుగా పేర్కొంటూ పెద్దపెద్ద భవనాలు దర్శనమిస్తున్నాయి. దీంతో వీటికి జిల్లా నలుమూలల నుంచి వచ్చే రోగుల తాకిడి ఎక్కువైంది. కానీ రోగులకు మెరుగైన సేవల సంగతి అటుంచితే .. వారిని నిలువుదోపిడీ చేస్తుండడం శోచనీయం.

–ఖలీల్‌వాడి, మే 26





దవాఖాన నుంచి మొదలైన దోపిడీ అంబులెన్సు డ్రైవర్ల వరకు పాకింది.అనారోగ్యం బారినపడి వచ్చిన వారి బలహీనతను ఆసరాగా చేసుకొని కొన్ని దవాఖానలు అందినకాడికి దోచుకుంటున్నాయి.మల్టీ, సూపర్ స్పెషాలిటీలతో ఆకర్షణ పెద్దపెద్ద భవంతులు నిర్మిస్తూ అందులో వసతులు, పూర్తిస్థాయి వైద్య సిబ్బంది లేకున్నా మల్టీ, సూపర్ స్పెషాలిటీ దవాఖాన అంటూ ఆకర్షిస్తున్నారు. అర్హత లేకున్నా ఇద్దరు, ముగ్గురు వైద్యులను తీసుకువచ్చి మల్టీస్పెషాలిటీ పేరుతో దవాఖాన నిర్వహిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడ తమ ప్రాణాల మీదకు వస్తుందోనని హైదరాబాద్‌కు రిఫర్ చేస్తూ చేతులు దులుపుకోవడం గమనార్హం. సదరు రోగిని హైదరాబాద్‌కు తరలించేలోపు మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కోకొల్లలు. కొన్ని దవాఖానలు ఏ రోగమైనా ఇక్కడే నయం చేస్తామని, ఎక్కడకీ వెళ్లనవసరంలేదంటూ ప్రకటనలతో రోగులను మభ్యపెడుతున్నాయి. చివరి నిమిషంలో తమ వద్ద సరైన సదుపాయాలు, స్పెషలిస్టులు లేరంటూ మరో హాస్పిటల్‌కు పంపించేస్తున్నాయి. దీంతో చేసేదేమీలేక రోగులు, వారి బంధువులు నిస్సహాయంగా ఉండిపోవాల్సి వస్తున్నది. ప్రైవేట్ దవాఖానల్లో ఇంత జరుగుతున్నా పట్టించుకునేవారెవరు.. ఒకవేళ ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా తనిఖీలు చేపడుతున్నారు. విచారణ చేపట్టి నివేదికలు ఇచ్చినా అవన్నీ చెత్తబుట్టలోకి చేరుతున్నాయి.

**మల్టీ స్పెషాలిటీ అంటే..**

మల్టీ స్పెషాలిటీ దవాఖానలో అన్ని సౌకర్యాలు ఉండి, అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండాలి. అన్ని విభాగాలకు చెందిన వైద్య నిపుణులు ఉండాలి. దవాఖాన బహుళ ఆరోగ్య సంరక్షణ కేంద్రంగా ఉండాలి. కానీ వచ్చి రాని వైద్యంతో రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కొన్ని దవాఖానల్లో వైద్యులు అందుబాటులో లేకపోతే కాంపౌండర్లతోనే వైద్యం చేయిస్తుండడం గమనార్హం.

## ముందు అద్దె భవనం..తర్వాత సొంత భవనం

దవాఖాన ప్రారంభించడానికి ముందుగా ఓ అద్దె భవనం తీసుకుంటున్నారు. అందులో అరకొర వసతులు ఏర్పాటు చేస్తున్నారు. రోగులు వస్తే చాలు చిన్న రోగాన్ని వారికి భూతద్దంలో పెద్దగా చూపించి అందినకాడికి దండుకుంటున్నారు. ఇలా నెలలు, సంవత్సరాల్లో కోట్లకు పడగలెత్తి సొంత భవనం నిర్మించి వాటిని మల్టీ, సూపర్ స్పెషాలిటీ దవాఖానలుగా మారుస్తున్నారు. దవాఖాన నిర్మాణానికి అయిన ఖర్చులన్నీ రోగుల నుంచి రాబడుతున్నారు. అవసరం లేకున్నా ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేసుకొని రూ.లక్షల్లో బిల్లులు వేస్తున్నారు. అడిగితే ప్రాణాలకు, తమకు సంబంధం లేదంటూ తప్పించుకుంటున్నారు.

## నోటీసులతో సరి.. కమిటీలతో కాలయాపన

కొన్నిసమయాల్లో చోటుచేసుకున్న ఘటనల్లో ప్రైవేట్ దవాఖానల వైఫల్యం స్పష్టంగా కనిపించినా అధికారులు చర్యలు తీసుకోకుండా నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొంటున్నారు. తనిఖీల పేరిట డబ్బులు వసూలు చేయడమే తప్ప.. ఇప్పటి వరకు ఏ ఒక్క మల్టీ, సూపర్ స్పెషాలిటీ దవాఖాలనపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడం గమనార్హం. జిల్లాలోనే పేరుగాంచిన ప్రైవేట్ దవాఖానల్లో రోజుకో ఘటన చోటుచేసుకుంటున్నా కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారు. పోయిన ప్రాణాలు తిరిగిస్తారా అని మృతుడి బంధువులు నిలదీస్తే .. నోటీసులు జారీ చేశామంటూ అధికారులు సమాధానమిస్తున్నారు.

## చర్యలు తీసుకుంటాం..

ప్రైవేట్ దవాఖానలపై ప్రత్యేక నిఘా ఉంచి, ఒక స్పెషల్ కమిటీని ఏర్పాటు చేశాం.ఆ కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేని దవాఖానపై ప్రత్యేక నిఘా ఉంచి, వైద్యశాఖ నిబంధనలు పాటించనివారిపై యాక్షన్ తీసుకుంటాం.

**-తుకారాం రాథోడ్,**
**జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి**

---

# తండాల్లో 'పోడు' పంచాయితీ

- పోడు పట్టాలను అడ్డం పెట్టుకొని అటవీ భూములు ఆక్రమణ
- ఆక్రమించిన భూములు తమవేనంటూ కొత్తబాది, సోమారం తండాల కొట్లాట

గాంధారి, మే 26: అటవీ భూముల కోసం రెండు తండాలకు చెందిన వారు గొడవలకు దిగిన సంఘటన కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలో ఆదివారం చోటు చేసుకున్నది. గాంధారి మండలం కొత్తబాది తండా, సోమారం తండాలకు చెందిన పలువురు రైతులు పోడుపట్టాలను పొందారు. ఈ పట్టాలను అడ్డం పెట్టుకొని చాలా మంది యథేచ్ఛగా అటవీ భూములను ఆక్రమిస్తున్నారు. భూములను ఆక్రమించే క్రమంలో ఒకరి తండా శివారులోకి మరొకరు వెళ్లడం గొడవలకు దారితీసింది. కొత్తబాది, సోమారం తండాల్లో చాలా మంది 5 నుంచి 10 ఎకరాల వరకు పోడు పట్టాలను పొందారు. దీంతో ఆగకుండా కొత్తగా అటవీ భూముల్లోని చెట్లను నరికివేస్తూ ఆక్రమిస్తున్నారు. ఆ భూములు తమవి అంటే తమవని రెండు తండాలకు చెందిన వారు గొడవలకు దిగారు. అటవీ భూముల కోసం రెండు తండాలకు చెందిన వారు గొడవలు పడుతున్నప్పటికీ అటవీ శాఖ అధికారులకు ఏమీ తెలియనట్లు ఉంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. గాంధారి మండలంలోని చద్మల్‌తండా, నాగ్లూర్ తండా, నేరల్‌తండా,బీర్మల్ తండా, కొత్తబాది తండా, సోమారంతండా, గండివేట్, సీతాయిపల్లి, పేట్ సంగెం, పొతంగల్ కలాన్, కాటేవాడీ, కర్ణంగడ్డ తండాల్లో వేలాది ఎకరాల అటవీ భూములు ఆక్రమణకు గురయ్యాయి.



ట్రాక్టర్ల సహాయంతో అటవీ భూమిని దున్నుతున్న తండావాసులు

---



జొన్నల లోడ్‌తో రహదారి పక్కన నిలిపిన లారీలు

# రోడ్డుపైనే జొన్న లారీలు..

- నాలుగు రోజులుగా నిరీక్షణ
- పత్తాలేని అధికారులు.. పనిచేయని కూలీలు

నాగిరెడ్డిపేట, మే 26: కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాముల వద్ద జొన్నల లోడ్‌తో లారీలు నాలుగు రోజులుగా నిరీక్షిస్తున్నాయి. జిల్లాలోని మద్నూర్, పిట్లం, జుక్కల్, బిచ్కుంద, పెద్దకొడప్‌గల్, గాంధారి మండలాల్లో ప్రభుత్వం కొనుగోలు చేసిన జొన్నలను నాలుగు రోజుల క్రితం అధికారులు స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములకు తరలించారు. కానీ గోదాముల వద్ద కూలీల కొరతతో..నాలుగు రోజులుగా లారీలు అన్‌లోడ్ కావడం లేదు. గోదాముల వద్ద వందకుపైగా లారీలు లోడ్‌తో ఉన్నాయని, ఇప్పటి వరకు అధికారులు స్పందించడం లేదని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి లారీలు అన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# కర్నీ అగ్రికల్చర్ పార్కును సందర్శించిన ఎమ్మెల్యే వేముల



అక్కడి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల

వేల్పూర్, మే 26: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం ప్రెస్నో నగరం పొలిమేరలో ఉన్న కర్నీ అగ్రికల్చర్ పార్కును స్థానికురాలు క్యాండీస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. అక్కడ సేంద్రియ పద్ధతుల్లో స్వీట్ పొటాటో(రత్నపురిగడ్డ), ఇతర కూరగాయ పంటలను సాగు చేసే తీరును పరిశీలించారు. ఇండో ఆఫ్రికన్ రైతు ప్రతినిధి, పార్కు మేనేజర్ క్రిస్‌ఫీల్డ్, మహిళా రైతు హేన్స్‌ను ఆధునిక సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. అక్క డ పని చేస్తున్న రైతు కూలీ జూన్‌తో మాట్లాడి పంటల సాగు వివరాలు ఎమ్మెల్యే తెలుసుకున్నారు.